క్లుప్తంగా

మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

ఓదెల: మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పొత్కపల్లి ఎస్సై జి.అశోక్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూడెం గ్రామంలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. గూడెం గ్రామం మీదుగా వెళ్లే వాహనదారులకు పరీక్షలు చేశారు. హెడ్ కానిస్టేబుల్ లచ్చిరెడ్డి ఉన్నారు.

పోచమ్మ కొలుపు ఉత్సవాలకు ఏర్పాట్లు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో కొన్ని రోజుల్లో నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన, పోచమ్మ కొలుపు ఉత్సవాల ఏర్పాటు పనులను గురువారం గ్రామస్తులు ప్రారంభించారు. గ్రామంలోని భూలక్ష్మి వద్ద నేలను చదును చేయించి మట్టిపోయించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు వెళ్లే దారిలో ఉన్న కేఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ సమస్యలపై చర్చ జరుగుతుందని, కమాన్‌పూర్, ముత్తారం, బేగంపేట, మంథని, ఎక్లాస్‌పూర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతపై అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు రజిత, ఐలయ్య, వైస్ ప్రిన్సిపాల్ శంకరయ్య పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

సుల్తానాబాద్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పద్మపాని సొసైటీ క్రాంతి కళాబృందం జిల్లా కోఆర్డినేటర్ లోకిని రమేశ్ కోరారు. గురువారం మున్సిపల్‌లోని పూసాల రోడ్డు చౌరస్తా వద్ద హెచ్ఐవీ, క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు. క్షయ వ్యాధి, హెచ్ఐవీ వ్యాధితో రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలని కళాబృందం అవగాహన కల్పించింది. కళాకారులు వెంకటాచారి, నల్ల ఆంజనేయులు, మాధవి, ప్రకాశ్, పద్మపాని సొసైటీ లింక్ వర్కర్లు శ్రీలత, సంపత్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



సర్టిఫికెట్ అందిస్తున్న కరస్పాండెంట్ రవీందర్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న వివేకానంద పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనుకృతి నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన ఆన్లైన్ పరీక్షలో ప్రతిభ కనబరిచింది. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని అభినందించారు. సర్టిఫికెట్‌ను పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ రవీందర్ అందజేశారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కాలేజ్ ప్రిన్సిపాల్ చందు, వైస్ ప్రిన్సిపాల్ రజిత పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సుల్తానాబాద్: సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవడంతో క్షీరాభిషేకం నిర్వహించినట్లు సంఘ నాయకులు తెలిపారు. సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, శివాలయం కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







బైకను స్వాధీనం చేసుకుంటున్న షీ టీం పోలీసులు, బైక్ రైడర్స్‌ను ఫొటో తీస్తున్న షీ టీం పోలీసులు

ఆకతాయిల ఆట కట్

పరీక్ష కేంద్రం వద్ద ఆకతాయిలతో విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను 'ట్రిపుల్ రైడింగ్.. ర్యాష్ డ్రైవింగ్' శీర్షికన సాక్షి ప్రచురించడంతో పోలీసులు కథనానికి స్పందించారు. గురువారం పరీక్ష కేంద్రాల వద్ద ఇటు పోలీసులు, మరోవైపు షీ టీం ఆకతాయిలను గుర్తించి ఫొటోలు తీస్తూ వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సౌండ్ పొల్యూషన్ చేస్తూ రోజూ బైక్ విన్యాసాలతో చాలా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై స్పందించి చర్యలు తీసుకున్న పోలీసులతో పాటు 'సాక్షి' చొరవను అభినందించారు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు. **– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి**



మళ్లీ లీకేజీ..

కోల్‌సిటీ: 'బొట్టు బొట్టు లెక్కపెట్టు, చుక్క చుక్క ఒడిసిపట్టు, వృథాకు చెక్కుపెట్టు, సుజలాలతో అంతా సుభిక్షం అయ్యేట్టు..' రామగుండం నగరపాలక సంస్థలో ఈ నినాదాలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలతో నీరంతా రోడ్డుపై వృథాగా పారుతున్నా.. బల్దియా అధికారులకు మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదని బల్దియా ప్రజానీకం ఆరోపిస్తున్నారు. గోదావరిఖనిలోని దుర్గానగర్ బోర్డు ముందు ప్రధాన రహదారిపై మున్సిపల్ పైప్‌లైన్ లికేజీతో తాగునీరు వృథాగా పారుతోంది. వారంరోజుల క్రితమే అధికారులు టెండర్ ద్వారా రోడ్డు తవ్వి, పైప్‌లైన్ జాయింట్ పనులు నిర్వహించారు. పనులు పూర్తి చేసినట్టు కాంట్రాక్టర్ చెప్పినా, జాయింట్ వేసిన పైప్‌లైన్ నుంచి నీరు మళ్లీ లీకవుతోంది. అధికారులు ఇప్పటికైనా లీకేజీపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సుల్తానాబాద్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌కు పూర్వ వైభవం తీసుకొని వస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. గురువారం పట్టణంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2కోట్లతో స్థలం కొనుగోలు చేయడంతో పాటు రూ.86 లక్షలతో బిల్డింగ్, చెరువు కట్ట వద్ద డ్రైనేజీ నిర్మాణానికి రూ.25లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సుల్తానాబాద్ పాత తాలూకా కేంద్రం కావడంతో రాజకీయ, ఆర్థిక, వ్యాపార, సామాజిక రంగాల్లో ముందు వరుసలో ఉండేదని, ప్రస్తుతం వెనుకబడి ఉండడాన్ని గ్రహించానని, పూర్వ వైభవం తీసుకొస్తానని చెప్పారు. ఇక్కడి నుంచి వెళ్లిన కార్యాలయాలను తిరిగి తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

కేడీసీసీ బ్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం

సుల్తానాబాద్‌లో కేడీసీసీ బ్యాంకు నిర్మాణ పనులను ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద బ్రాంచ్ సుల్తానాబాద్ అని, ఏడాదికి రూ.1500కోట్ల రుణాలు రూ.70కోట్ల డిపాజిట్లు సేకరిస్తూ ముందుకు వెళ్తోందన్నారు.

డ్రైనేజీ నిర్మాణం నాణ్యతతో చేయాలి

పట్టణంలోని ఊర చెరువు నుంచి పాత జెండా మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. ఎంపీపీ బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బిరుదు సమత, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, కమిషనర్ వేణుమాధవ్, సింగిల్‌విండో చైర్మన్లు శ్రీగిరి శ్రీనివాస్, మోహన్‌రావు, వేణుగోపాల్‌రావు, సంతోష్‌రావు, విజయ్‌పాల్‌రెడ్డి జీఎం సత్యనారాయణరావు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మార్కెట్‌లో షాపింగ్ గదులు ప్రారంభం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సులో 15గదులను గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. రూ.2.10కోట్ల నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సు గదులను అద్దెకు ఇవ్వడం ద్వార మార్కెట్ కమిటీకి ప్రతినెలా ఆదాయం సమకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. జెడ్పీటీసీ రామ్మూర్తి, మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు గుండేటి ఐలయ్య, శంకర్‌నాయక్, నాయకులు ముడుసు సాంబిరెడ్డి, గంట రమేశ్, దేవసాని ధర్మయ్య, చంద్రమౌళి, ఆంజనేయరావు, సరోత్తంరెడ్డి పాల్గొన్నారు. అలాగే పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, కనగర్తి, కాపులపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

కాలువనీటి కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తా

ఓదెల: నియోజకవర్గంలో పంటలు ఎండిపోకుండా ఎస్సారెస్పీ కాలువనీటిని అందిస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గురువారం మండలంలోని నాంసానిపల్లె నుంచి లక్ష్మీపురం వరకు రూ.3కోట్లతో బీటీరోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కునారపు రేణుకదేవి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీచైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, కాంగ్రెస్ నాయకులు స్వామి, పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ఐలయ్య పాల్గొన్నారు.

వైకుంఠధామంలో వసతులు కల్పించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామ శివారులో ఉన్న వైకుంఠధామంలో వసతులు కల్పించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు గురువారం వినతిపత్రం అందించారు. వైకుంఠధామంలో సరైన సౌకర్యాలు లేవని, ముళ్లపొదలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయని ఎమ్మెల్యేకు విన్నవించినట్లు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఈదునూరి మల్లేశ్ తెలిపారు. జిల్లా బీసీ సెల్ కార్యదర్శి మామిడాల రాజేశం, పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, మేరుగు తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈదునూరి రవి, రమేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ పార్టీకి చెందిన విద్యార్థి విభాగం నాయకులు పరకాల ప్రశాంత్ గౌడ్, ఎస్‌కే తాజ్ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు జక్కుల దామోదర్ రావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామగుండం ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం

రామగుండం: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ వివాహ వార్షికోత్సవం గురువారం ఆయన అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అంతర్గాం మండల పరిధిలోని అభిమానులు నూకాంబిక పోచమ్మ తల్లికి ముడుపు సమర్పించి ఎమ్మెల్యే దంపతులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. అదేవిధంగా రామగుండం పట్టణ పరిధిలోని అభిమానులు తబితా ఆశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనం

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్–మనాలి దంపతులకు గురువారం అర్చకులు వేద ఆశీర్వచనం పలికారు. ఎమ్మెల్యే పెళ్లిరోజు సందర్భంగా స్థానిక క్యాంప్ ఆఫీస్‌లో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.



రామగుండం: తబితా ఆశ్రమంలో అన్నదానం

కూరగాయల సాగులో నూతన పద్ధతులు పాటించాలి

జూలపల్లి: రైతులు కూరగాయల సాగులో మెలకువలు పాటించి, నూతన పద్ధతులతో అధిక దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి ప్రత్యూష సూచించారు. పెద్దపల్లి వ్యవసాయ శాఖ అధికారులు మండల కేంద్రంలో మెండె మల్లేశం సాగు చేస్తున్న కూరగాయల సాగు వ్యవసాయ క్షేత్రాన్ని పెద్దపల్లి మండల రైతులకు చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కూరగాయలు పండించడంలో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. దుక్కి దున్నడం నుంచి మొక్కల ఎంపిక, సస్యరక్షణ చర్యలు, పందిళ్లు వేసి పెంచడం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. పెద్దపల్లి మండల వ్యవసాధికారి అలివేణి, ఏఈవోలు రాకేశ్, వినయ్ ఉన్నారు.



కూరగాయల సాగును పరిశీలిస్తున్న రైతులు

ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలుపై గురువారం అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాలతో హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది స్థానిక కల్యాణ్‌నగర్, లక్ష్మీనగర్‌లోని షాపుల్లో తనిఖీ నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జ్యూస్ సెంటర్లు, మద్యం దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసులు వాడొద్దని అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేస్తున్న అధికారులు

సీఅండ్ఎండీకి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి బీసీ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బీసీలైజనింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ గురువారం సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాంను బీసీ నాయకులు సన్మానించారు. హైదరాబాద్‌లోని సీఅండ్ఎండీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ ఎంప్లాయీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీపంజాల శ్రీనివాస్, మధుకుమార్, దీటి చంద్రమౌళి, బి.చంద్రశేఖర్, వంగల విజయ్‌మోహన్ ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రామగుండం: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను సత్వరమే నెరవేర్చాలని, నాలుగు కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా ఐఎఫ్‌టీయూ, అఖిల భారత రైతు కూలీ సంఘం సంయుక్తంగా రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రైతాంగ సమస్యలను ఆరునెలలో పరిష్కరిస్తామని చెప్పిన కేంద్రం రెండేళ్లయినా అమలు చేయలేదని ఆరోపించారు. తక్షణమే రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా నాయకులు వెంకన్న, చంద్రయ్య, నాయకులు ఐ.కృష్ణ, ఈ.నరేశ్, అశోక్, శంకర్, భూమేశ్, మల్లేశ్, దుర్గయ్య, రాజకొమురయ్య పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈవో

ధర్మారం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి ఛాయాదేవి కోరారు. మండలంలోని రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు వంశీ మోహనాచార్యుల ఆధ్వర్యంలో కిండర్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై విద్యార్థులకు కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు ప్రధానోపాధ్యాయుడు వంశీమోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత లక్ష్మణ్, రామన్, మండల నోడల్ అధికారి ప్రభాకర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఎంపీటీసీ రోజారాణి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వరల్డ్ కిడ్నీ డే

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో గురువారం వరల్డ్ కిడ్నీ డేను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ కేక్ కట్ చేసి, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఆర్ఎంవోలు రేణుక, తిరుమలేష, జనరల్ ఫిజీషియన్ రాజేంద్రప్రసాద్, డయాలసిస్ సెంటర్ ఇంచార్జి రవీందర్, టెక్నీషియన్లు భూలక్ష్మి, ఆమని, స్రవంతి, పవన్, వినయ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల మద్దతు కోరిన ఆసంపల్లి శ్రీనివాస్

గోదావరిఖనిటౌన్: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వ్యాపారవేత్త ఆసంపల్లి శ్రీనివాస్ గురువారం స్థానిక కోర్టు ఆవరణలోని న్యాయవాదులను కలుసుకొని తనకు మద్దతు తెలపాలని కోరారు. స్థానికుడు దళిత సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని న్యాయవాదులు ప్రకటించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేంద్ర కమిటీ సభ్యులు శైలజ, జిల్లా అధ్యక్షుడు గోషిక ప్రకాశ్, మహిళా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షురాలు వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి శ్రీలత, మాదిగ లాయర్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి పెరుక మనోహర్, నేతకాని లాయర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ట్రెజరర్ ఎండీ ఉమర్ పాల్గొన్నారు.

కొండయ్యను యువత దర్శంగా తీసుకోవాలి

ఎలిగేడు: కార్మికుల హక్కుల కోసం, బడుగు, బలహీనవర్గాల, పేదలకోసం బుర్ర కొండయ్యగౌడ్ పోరాటం చేశారని ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు అన్నారు. బుర్ర కొండయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో ఎలిగేడులో మృతి చెందారు. కొండయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తాటిపల్లి సతీశ్ బాబు, కేశెట్టి లక్ష్మన్‌కుమార్, శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నాగభూషణం పాల్గొన్నారు.

టీచర్లపై డీఈవో ఆగ్రహం

ఓదెల: సమయపాలన పాటించకుండా పాఠశాలకు వస్తున్న ఉపాధ్యాయులపై డీఈవో మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కొలనూర్, పొత్కపల్లి, ఓదెల, గోపరపల్లె పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా సమయపాలన పాటించని ఉపాధ్యాయుల హాజరుపట్టికలో గైర్హాజర్ మార్క్ వేశారు. సమయానికి రాని ఉపాధ్యాయుల ఒకరోజు జీతం నిలిపివేయాలని ఎంఈవోను ఆదేశించారు.

గురుకుల పాఠశాలలో ఫేర్‌వెల్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: నగరంలోని సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ సబితారాణి, ఉపాధ్యాయులు అనిత, సంధ్య, ప్రమీల, సుధారాణి, శ్రీలత, సలీమా, షేక్ రహీం, కనకరాజు, సురేశ్, విష్ణుమూర్తి, కృష్ణస్వామి, మల్లేషం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జ్యోతినగర్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎన్టీపీసీ పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఎస్సై ఉదయ్‌కిరణ్‌తో పాటు సిబ్బంది మేడిపల్లి ఓపెన్ కాస్ట్ రోడ్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న గోదావరిఖనికి చెందిన రెండు ట్రాక్టర్లను గుర్తించి స్టేషన్‌కు తరలించారు.

కోర్టు నిర్ణయాన్ని రాజకీయం చేయొద్దు

మంథని: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మించిన కట్టడాలను కోర్టు ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేస్తే దానికి రాజకీయ రంగు పులమడం సరికాదని కాంగ్రెస్ మండల, మున్సిపల్ నాయకులు అన్నారు. గురువారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పాలకవర్గం నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అనుమతి ఇచ్చారన్నారు. కూల్చివేతలకు కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఓడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, అజీంఖాన్, ఎరుకల ప్రవీణ్, కుడుదుల వెంకన్న, పెంటరి రాజు ఉన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పించండి

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు వెంటనే కేటాయించాలంటూ లబ్ధిదారులు గురువారం కలెక్టరేట్ ఎదుట రాజీవ్‌రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గతంలో డబుల్‌బెడ్‌రూంలకు ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఇళ్లు కేటాయించాలని కోరారు. పెద్దపల్లి ఎస్సైలు సుధాకర్‌రావు, మల్లేశ్ వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులను కలిసి విన్నవించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గోదావరిఖని: స్థానిక ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి చేసి 9 మందిని గురువారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.61లక్షల నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

గోదావరిఖని: బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగుండం హౌసింగ్ బోర్డు కాలనీ ఎంఎం గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు, పాలకుర్తి మండల పరిధిలోని బసంత్‌నగర్ జీఎం గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 5గంటలకు గోదావరిఖని తిలక్‌నగర్‌డౌన్ విశ్వం కమ్యూనిటీహాల్లో సమావేశాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, ముఖ్యనాయకులు హాజరు కావాలని కోరారు.

సెక్టార్ వన్‌లో క్వార్టర్స్ కేటాయించాలి

గోదావరిఖని: రోడ్డు విస్తరణలో క్వార్టర్లు కోల్పోతున్న కార్మికులకు సెక్టార్ వన్‌లోనే తిరిగి క్వార్టర్లు కేటాయించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ ఒక ప్రకటనలో కోరారు. అలాగే షాపులు కోల్పోతున్న చిరు వ్యాపారులకు అదే స్థలంలో షెడ్లు తిరిగి నిర్మించి ఇవ్వాలన్నారు.

నాటుసారాకు బెల్లం అమ్మితే చర్యలు

ముత్తారం: కిరాణం దుకాణాల్లో బెల్లాన్ని నాటుసారా తయారీకి అమ్మితే చట్టపరంగా చర్యలు ఉంటాయని మంథని అబ్కారీశాఖ ఎస్సై సాయికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో కిరాణం దుకాణాలను ఆయన పరిశీలించారు. మండలంలోని బెల్టు దుకాణాలను తనిఖీ చేయగా ఓడేడ్‌లో ఓ బెల్టుదుకాణంలో రూ.10వేల విలువ గల మందు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మంథని మున్సిపల్ చైర్మన్‌గా దళిత మహిళకు అవకాశం ఇవ్వాలి

ధర్మారం: మంథని మున్సిపల్ చైర్మన్‌గా దళిత మహిళకు అవకాశం కల్పించాలని మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం మల్లేశం కోరారు. గురువారం ఆయన ధర్మారంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో కొత్త చైర్మన్‌గా దళిత మహిళకు కేటాయిస్తే దళితులకు సముచిత స్థానం కల్పించినట్లు భావిస్తామన్నారు.

నేత్రదానం చేయదానికి ముందుకు రావాలి

కోల్‌సిటీ: అపోహలు వీడి, నేత్ర, అవయవ దానం చేయడానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి పిలుపునిచ్చారు. గోదావరిఖని విజయ్‌నగర్‌కు చెందిన గుండేటి యశోద(61) ఇటీవల మృతి చెందింది. యశోద నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం విజయ్‌నగర్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం నేత్రదాత కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం వైపు పయనించేందుకు ఇష్టపడి చదవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో డిజైర్ వార్షిక వేడుకలు అంబరాన్ని అంటేలా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనంతరం వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, జెడ్పీటీసీ వినుపాల స్వరూప, ఎలిగేడు ఎంపీపీ స్రవంతి, సాయిరి మహేందర్, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.